# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 16-06-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్‌లోని మూడు పారిశ్రామిక కారిడార్‌లను అభివృద్ధి చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని కేంద్రమంత్రి పీయూష్ గోయల్ తెలిపారు.**

2. **ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈరోజు విశాఖపట్నంలో పర్యటిస్తారు.**

3. **తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ఈరోజు రాష్ట్ర మంత్రులతో సమావేశమవుతారు.**

4. **హైదరాబాద్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయంలో నిర్వహించే రైతునేస్తం కార్యక్రమంలో తెలంగాణ ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి ఈరోజు పాల్గొంటారు.**

5. **అన్నదాత సుఖీభవ కింద రైతులకు 20 వేల రూపాయలను ప్రభుత్వం అందజేయనుందని ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.**

==========================

ఆంధ్రప్రదేశ్‌లోని మూడు పారిశ్రామిక కేరిడార్‌ను అభివృద్ధి చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖమంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. రాష్ట్రంలో పర్యటిస్తున్న కేంద్రమంత్రి నిన్న ముఖ్యమంత్రితో సమావేశం అనంతరం గుంటూరు నగరంలో పర్యటించారు. ఈ సందర్భంగా నగరంలోని పొగాకు బోర్డు జాతీయ కార్యాలయంలో "నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్మెంట్ సంస్థ -ఎన్ఐసిడిసి అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం కేంద్రమంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ

వాయిస్..33 సెకన్లు

కాగా.. తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామి వారిని కేంద్రమంత్రి ఈ ఉదయం దర్శించుకుంటారు. గతరాత్రి తిరుపతికి చేరుకున్న ఆయన ఈరోజు రోడ్డు మార్గం ద్వారా తిరుమలకు చేరుకుని స్వామి వారిని దర్శించుకుంటారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈరోజు విశాఖపట్నంలో పర్యటిస్తారు. ఈ ఉదయం గన్నవరం విమానాశ్రయం నుంచి బయలుదేరి విశాఖ చేరుకుంటారు. అనంతరం బీచ్‌రోడ్డులో చేపడుతున్న జాతీయ స్థాయి అంతర్జాతీయ యోగా దినోత్సవం ఏర్పాట్లు పరిశీలిస్తారు. తర్వాత యోగా దినోత్సవంపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. మధ్యాహ్నం పీఎం పాలెంలో పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారని అధికారులు తెలిపారు.

--------------------------

ప్రపంచానికి భారత దేశం అందించిన గొప్ప కానుక యోగా అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ఈ నెల 21న విశాఖపట్నంలో నిర్వహించే జాతీయ స్థాయి యోగా కార్యక్రమంలో ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందిస్తూ, మనిషి ఆయుష్షును పెంచే యోగా నిత్య జీవన విధానం కావాలన్నారు. ఈ నెల 21న విశాఖపట్నంలో 11వ ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా యోగాంధ్ర కార్యక్రమాన్ని భారీ ఎత్తున నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాల్గొంటున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాల్గొని, యోగాను జీవితంలో భాగం చేసుకుందాం.. ఆరోగ్యంగా జీవిద్దాం'అని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

-----------------------------

తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ఈరోజు రాష్ట్ర మంత్రులతో సమావేశమవుతారు. హైదరాబాద్ లోని రాష్ట్ర సచివాలయంలో జరిగే ఈ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై మంత్రులతో ముఖ్యమంత్రి చర్చించనున్నారు. అలాగే రైతు భరోసా నిధుల సమీకరణపై చర్చించే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

-----------------------------

తెలంగాణలో నిరుద్యోగ యువతలో నైపుణ్యాలు పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి అవసరమైన సహకారం అందించాలని ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి కోరారు. హైదరాబాద్ లోని ముఖ్యమంత్రి నివాసంలో కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి జయంత్ చౌధరితో నిన్న సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో నైపుణ్యాభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై కేంద్ర మంత్రికి వివరిస్తూ... తాము ప్రారంభించిన యంగ్ ఇండియా నైపుణ్య విశ్వవిద్యాలయంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేసి.. దానికి ఐటీఐలను అనుసంధానిస్తామని కేంద్ర మంత్రికి తెలిపారు. తెలంగాణ చేపట్టే నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలకు కేంద్ర ప్రభుత్వం తరఫున సహకరిస్తామని జయంత్ చౌధరి హామీ ఇచ్చారు.

-----------------------------

వ్యవసాయ రంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు అన్నారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలి మండల కేంద్రంలో 13 కోట్ల రూపాయలతో నిర్మించనున్న కోనేరు అభివృద్ధి పనులకు నిన్న ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య, వ్యవసాయం, తాగునీరు, సాగునీటికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు.

-----------------------------

ఆంధ్రప్రదేశ్ లోని విజయవాడ ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణా నది నుంచి కృష్ణా తూర్పు డెల్టా ప్రధాన కాలువకు వెయ్యి క్యూసెక్కుల నీటిని కేఈ హెడ్ రెగ్యులేటర్ ద్వారా నిన్న విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావు పాల్గొని నీటిని విడుదల చేశారు. అనంతరం విజయవాడ సెంట్రల్ శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ,

వాయిస్.. 30 సెకన్లు

-----------------------------

తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయంలో నిర్వహించే రైతునేస్తం కార్యక్రమంలో ఈరోజు పాల్గొంటారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రైతులతో ముఖాముఖిలో

పాల్గొని వారి సమస్యలను అడిగి తెలుసుకుంటారు. ఈ కార్యక్రమ ఏర్పాట్లను వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నిన్న పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వ్యవసాయరంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ఏడాదిన్నరలోనే రైతు సంక్షేమానికి 78 వేల కోట్ల రూపాయలను ఖర్చు చేసినట్లు తెలిపారు. వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జరిగే ముఖాముఖికి 15 వందల మంది రైతులు హాజరవుతారని, ఈ కార్యక్రమాన్ని 1,600 రైతు వేదికల్లో ప్రసారం చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు.

---------------------------

రానున్న రెండేళ్లలో ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణాన్ని పూర్తి చేస్తామని పురపాలక శాఖ మంత్రి పి నారాయణ తెలిపారు. నెల్లూరులో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రి నిన్న పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 50 వేల కోట్ల రూపాయలతో అమరావతి నిర్మాణ పనులకు టెండర్లు పిలిచామని చెప్పారు దేశంలోని వివిధ నగరాలను పరిశీలించి ప్రత్యేక ప్రణాళికలతో అమరావతిలో మౌలిక సదుపాయాలు.. వసతులను కల్పిస్తామని మంత్రి వెల్లడించారు.

---------------------------

సాహితీ రంగానికి విశిష్ట సేవలు అందించిన రచయిత, చిత్రకారులు, రేడియో ప్రసార ప్రముఖులు ఆచంట జానకి రామ్, వచన రచనకు సొబగులు అద్దిన మల్లాది రామకృష్ణశాస్త్రిల జయంతులు ఈరోజు. 1903వ సంవత్సరం జూన్ 16 వ తేదీన జన్మించిన ఆచంట జానకి రామ్ దేశంలో రేడియో ప్రసారాలు ప్రారంభమైన కొత్తలో ఆ సంస్థలో ఉద్యోగంలో చేరారు. ఢిల్లీ, తిరుచిరాపల్లి ఆకాశవాణి కేంద్రాల్లో పనిచేసిన ఆయన "నా స్మృతి పథంలో", "సాగుతున్న యాత్ర" వంటి రచనలు చేశారు. రేడియో కార్యక్రమాల రూపకల్పనలో వివిధ హోదాలలో ఆకాశవాణికి 21 సంవత్సరాల పాటు సేవలు అందించిన ఆచంట జానకీరామ్ 1994 సంవత్సరంలో కన్నుమూశారు.

మల్లాది రామకృష్ణ శాస్త్రి 1905 జూన్ 16 వ తేదీన కృష్ణా జిల్లా చిట్టిగూడూరు గ్రామంలో జన్మించారు. రచయితగా, కవిగా, నాటక రచయితగా కూడా ప్రసిద్ధి గాంచారు. "చలవ మిరియాలు" రచన ఆయనకు మంచి పేరు తీసుకు వచ్చింది. తెలుగు చలన చిత్ర రంగానికి సరికొత్త భాషా పరమైన మాటలు, పాటలు పరిచయం చేసి ... వినూత్న ఒరవడికి నాంది పలికారు. 39 చలన చిత్రాలలో 200కు పైగా పాటలు రాసిన మల్లాది రామకృష్ణ శాస్త్రి 1965 సెప్టెంబర్ 12 వ తేదీన చెన్నైలో తుది శ్వాస విడిచారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రస్తుత వాతావరణ పరిస్థితి గురించి అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎల్. నారాయణ ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగానికి వివరిస్తూ..

వాయిస్...27 సెకన్లు

=====================